"క్షమించు సుజాత" అర్థించాడు.

"నే కాదండి మీమ్మల్ని అంజమ్మే క్షమించింది దాని సంస్కారంలో వందోవంతు సంస్కారం ఇవ్వలేదు మీకు మీ చదువు, హోదా, తెల్లనివన్నీ పాలు కాదని తెలుసుకోండి" విసవిసా లోపలి కెళ్ళిపోయింది

సుజాత కిప్పుడు వెనకటి సూక్తి గుర్తు రావడం లేదు. "శీలం హి సర్వస్య నరస్య భూషణమ్" అనే సూక్తే ఎప్పుడూ మనస్సులో మెదులుతుంటుంది

# దేశం పిలిచింది

కొడుకు సాంబయ్య వస్తున్న సంగతి తెలియగానే వెంకటేశు సంతోషంతో వుబ్బి తబ్బిబ్బులయ్యాడు. ఉత్తరం పట్టుకుని వాడ పెద్ద ఫకీరయ్య దగ్గరికి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బయలు దేరాడు. దార్లో కనిపించిన వాళ్ళందరికీ చెప్పుకుంటూ ఫకీరయ్య పాక చేరుకున్నాడు. సాంబయ్య రాక గురించి విన్న ఫకీరయ్య ఆనందంతో "మన సాంబన్న వస్తున్నాడా?" అన్నాడు, గొంతు గద్గదిక మయింది.

సాంబయ్య పేరు చెబితే వాడంతా వుప్పొంగుతుంది. సాంబయ్య ఆ వాడలో ప్రతి యిల్లూ తనదిగా ఎంచుకుంటాడు. అభిమానం పంచుకుంటాడు

ఫకీరయ్య ఒక్క నిమిషం ఆలోచించి "వెంకటేశం! జాగ్రత్తగా విను రోడ్డు కాడికి అందరం ఎప్పటిలాగే వెళ్ళాలి. అన్ని

ఏర్పాట్లు జరగాల్సిందే. ఇంకోమాట వాడ సంగతి అక్కడ ఎవ్వరూ ఎత్తకూడదు. సాంబన్న మొహంలో కానీపన్నా సంతోషం మనం చూడాలి తెలిసిందా!" హెచ్చరించాడు.

కొడుకు వస్తున్నాడన్న సంబరంలో వెంకటేశు వాడకి జరిగిన ఘోర కలి ఒక క్షణంపాటు మరిచిపోయాడు. వాడలోవున్న అరవయి కుటుంబాల పేదరికానికి మారుపేరు. గాంధీజీ "హరిజన" పదం వాడక పోతే కనీస" పేటలో నన్నా గౌరవం ఉండేది కాదు. కూలినాలి చేసు కుని ఒక పూటైనా డొక్క నింపుకునే జనం అక్కడ ఉంటున్నారు. పెంకుటిల్ల నేది మచ్చుకయినా హరిజన వాడలో కనిపించదు. అనీ తాటాకు పాకలే. సాంబయ్య వచ్చినప్పుడల్లా ప్రతి యింటికి వెళ్ళి చెవులో గూడు కట్టుకుని చెప్పబట్టి ఉన్నంత వరకు పరిశుభ్రంగా ఉంచు కుంటున్నారు. అతని పూనిక వల్లనే వాడలో రెండు బోరింగు పంపులు ఏర్పాటు చేసింది ప్రభుత్వం వీధి దీపాలు వచ్చాయి.

ఎందుకో వూర్లో కొందరు ఖామందులికి హరిజనుల మీద కోపం వచ్చింది అంతకూ హరిజనవాడ వూరికి కొంత దూరంలో ఉంది. సాగు పనుల్లో కూలీ రేట్ల గురించి ఒకసారి పేచివచ్చి మాటమాట అను కున్నారు. వాడలో అనుభవంలేని కుర్రాళ్ళు ఉడుకు రక్తంతో జవాబు చెప్పడంతో మోత బర్లకి తప్పనిపించింది. ఫకీరయ్య కలగజేసుకుని కుర్రాళ్ళని మందలించాడు. అయినా కామందుల ఆగ్రహం తగ్గలేదు. ఇచ్చిన కూలి డబ్బులు తీసుకుని కుక్కిన పేల మాదిరి పడుండే ఈ జనం ఇప్పుడు కళ్ళు తెరిచి ఎక్కువ కూలి యిమ్మనడంతో ఖామందుల అహం దెబ్బతింది. ఇవ్వాళ కూలీ పెంచమని అడిగే ధైర్యంతెచ్చుకున్న జనం రేపు ఇంకేమైనా అడగొచ్చనే శంక పెరిగింది ఊరి పెద్దల్లో. మొలకగా ఉన్నప్పుడే వంచడం అవసరం అన్న సంకల్పం అందరిలో గట్టి పడింది ఫలితంగా హరిజన వాడలో కుర్రాళ్ళుగా చెలామణి అవుతూ

తలకాయ లెత్తేందుకు యత్నించినా వాళ్ళు, కర్రల బలం రుచి చూశారు. దాడిని సహించి కిమ్మనకుండా ఊరుకుంటే గ్రంధం అక్కడితో ముగిసేది. అత్మరక్షణకి డబ్బున్న అసాములు పెట్టిన పేరు పొగరుబోతు తనం. తరతరాలుగా ఎన్నడూ ఎరగని వైఖరి ఖామందులు తమ అంతస్తుకే సవాలుగా భావించారు. ధనగర్వం కోపాన్ని తారాస్థాయికి తీసుకుపోయింది. కోపాగ్నికి హరిజన వాడలో కొన్ని పాకలు ఆహుతి అయ్యాయి.

ఇది జరిగి పట్టుమని పది రోజులు కాలేదు. హరిజన వాడకు ఇప్పుడు పోలీసు బలగం కాపలా కాస్తోంది. ఉన్న కొంప కాస్తా బుగ్గిపాలైన నిరుపేదలకి సర్కారు సహాయం అందిస్తామంటారు.

ఇలాంటి పరిస్థితులో సాంబయ్య వస్తున్నాడు. అతని గుండె ఎన్ని ముక్కలై పోతుందోనని వాడలో అందరి ఆందోళన. అయినా వాడలోకి ప్రవేశించే వరకు దీనిని గురించి పెదవి కదప కూడదని ఫకీరయ్య ఆంక్ష.

బస్సు హరిజన వాడకు దాదాపు కిలో మీటరు దూరంలో ఆగుతుంది. అక్కణ్ణుంచి మట్టి రోడ్డుంది. ఊరు పక్కగా పోతుందిరోడ్డు. ఫకీరయ్య తన కొడుకు రత్నానికి సాంబయ్య రాక గురించి చెప్పి అన్ని ఏర్పాటు చేయమని పురమాయించాడు. నాలుగు డప్పులన్నా లేకపోతే పసందే ఉండదు. వాడలో ఉన్న నాల్గింటిలో రెండింటిని అగ్గిదేవుడు ఆరగించాడు. పొరుగు గూడెం నుంచి రెండు డప్పులు తెప్పించాడు.

పట్నం నుంచి వచ్చే బస్సు ఉదయం పది గంటలకి రోడ్డు దగ్గర కొస్తుంది. ఆ రోజు వాడంతా సందడితో నిండింది. ఉన్న వాటిలో మంచి పూలతో దండ కట్టారు. డప్పులు సిద్ధమయ్యాయి. వెంకటేశు, భార్య రాజమ్మ, ఫకీరయ్య రత్నం హడావుడి పడుతున్నారు. వాళ్ళే

కాదు. వాడలో ప్రతి ఒక్కరూ సాంబయ్యని బస్సు దగ్గరే కలుసుకునేందుకు ఉన్నంతలో మంచి బట్ట లేసుకుని తయారవుతున్నారు. సాంబయ్య అందరికీ కావలసినవాడే. మిలిటరీ దుస్తుల్లో అతణ్ణి చూడాలని, అతని చల్లని మాట వినాలని ఉవ్విళ్ళూరుతారు. నిజానికి సాంబయ్య లాంటివాళ్ళు కలల్లోనో కథల్లోనో తారసపడతారు.

బస్సు రావడానికి అరగంట ముందే అందరు అక్కడికి చేరుకున్నారు. కోలాహలంగా ఉంది. వాడలోకి వచ్చిపడ్డ ఉపద్రవాన్ని తాత్కాలికంగా మరచిపోయి బస్సుకోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ముందుకొస్తున్న ఎర్రటి చుక్కలా అల్లంత దూరంలో బస్సు జాడ పసిగట్టిన జనం "సాంబయ్యొస్తున్నాడు" అని ఆనందంతో అరిచారు బస్సు దగ్గరవుతున్న కొద్దీ రోడ్డంచు దాక జనం తోసుకెళ్ళారు. హుందాగా బస్సు ఆగింది.

సైనిక దుస్తుల్లో సాంబయ్య పెట్టె బెడ్డింగు పట్టుకుని బస్సు తలుపు దగ్గర నిలబడితే ఆనందం ఆకాశం ముట్టేట్టు "సాంబయ్యా" అని అందరూ గుండెల్లోతులోంచి స్వాగతం పలికారు. డప్పుల వాద్యం లయబద్ధంగా ఆహ్వానం పలికింది. రత్నం సామానందుకున్నాడు. మెళ్ళో దండేశాడు.

మెరిసేకళ్ళతో సంతోషం పొంగులువారే చిరునవ్వుతో సాంబయ్య అందరివంక పలకరింపుగా చూశాడు. ఆ చూపులో ఆత్మీయత ఉట్టిపడింది. ముందు వరుసలో ప్రేమాద్భుత మూర్తిగా వుక్కిరిబిక్కిరైన సంతోషంతో నీళ్ళు నిండిన కళ్ళతో వాత్సల్యం కురిపిస్తూ రుద్ధమైన కంఠంతో మాట సరిగా పెగిలిరాక "అయ్యా సాంబా!" అని అక్కున చేర్చుకున్న రాజమ్మను "అమ్మా!... అమ్మా!" అని నూరు గొంతులు ఒక్కటయినా మూగపోయిన గళంతో నెమ్మదిగా పిలిచి "బావున్నావా

అమ్మా" అని కళ్ళు తుడుచుకున్నాడు. తండ్రిని కావిలించుకుని 'స్యా.. ఎలా ఉన్నావే' అని అనగలిగాడు.

ఫకీరయ్య దగ్గరికెళ్ళి "పెద్దయ్యా" అని వంగి పాదాలకు నమస్కరించాడు.

రత్నాన్ని బిగి కౌగిలిలో బంధించాడు. వచ్చిన ప్రతి ఒక్కరిని పేరు పేరునా పలకరించాడు.

వాడవైపు ఊరేగింపుగా కదలిపోతుంటే అదొక అనురాగపు వెల్లువలా తోచింది.

తాను పుట్టి పెరిగిన వాడ దగ్గరవుతున్న కొద్దీ తన ఇల్లు ఎప్పుడొస్తుందా అనే ఉత్కంఠ పెరుగుతోంది సాంబయ్యకి. వాడ మొదట్లో పెద్ద వేపచెట్టుంది. అది కనిపించగానే సాంబయ్య తన వాడ చేరుకుంటున్న ఆనందానుభూతి పొందాడు. కాని మరుక్షణంలో అది మాయమయింది. చెట్టు క్రింద నీలం రంగు పోలీసు వ్యాను చూడగానే. "పెద్దయ్యా! ఏంటిది? మన వాడ కోసమేనా యిదిక్కడుంది?" ఆత్రుతతో అడిగాడు.

"ఏదో చిన్న గొడవయితే పోలీసులు కాపలాగా వచ్చారు. అన్నీ తర్వాత మాట్లాడుకుందాంగా" సర్ది చెప్పాడు ఫకీరయ్య.

సాంబయ్య మనసు శంకించింది. పోలీసులు ఊరేగింపు దగ్గరికొచ్చి సంగతి తెలుసుకున్నారు. సాంబయ్యని సాదరంగా పలకరించారు.

వాడ లోపలికి వెళ్ళగానే తగలబడిన పాకలు దిగులుపడి చూశాయి. శోకం దాచుకుని గంభీరంగా నడిచి ముందుకు సాగాడు. మంటలకు మసిబారిన గోడలపైన అందాక తాటాకులు కప్పి పాక అనిపించుకుంటున్న తన ఇల్లు చేరాడు. కాసేపయ్యాక జనం నెమ్మదిగా ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

తల్లి మనసు నొప్పించడం యిష్టంలేక చెప్పిన ప్రకారం తలంటు పోసుకుని అన్నం తిన్నాడు. వెంకటేశు జరిగిన సంగతి అంతా వివరంగా చెప్పాడు.

సాంబయ్య మనసు కకా వికలమయింది. తన తక్షణ కర్తవ్యం ఆలోచించాడు. ఇదివరకయితే ముందు తన ఇల్లు బాగు చేసేవాడు. తర్వాత వాడలో ప్రతి ఇంటికి వెళ్ళి సంగతులు తెలుసుకునేవాడు వాడకు కావలసిన సౌకర్యాలు సమకూర్చేందుకు అధికార్ల దగ్గరి కెళ్ళి నచ్చ చెప్పి పనులు పూర్తి చేయించేవాడు. ఉన్న నాలుగు రోజులు విరామం లేకుండా తనవాడ ప్రజలందరికి సహాయపడడమే సాంబయ్య ధ్యేయం.

ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది ఉద్రేకపడి నలుగుర్ని రెచ్చగొట్టడం సాంబయ్య తత్వం కాదు పాతికేళ్ళయినా నిండని సాంబయ్యలో గాంధేయ భావాలు చోటు చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాంబయ్య పట్టుదల గలవాడు; వినయానికి తగిన వివేకం, ఆలోచన ఉన్నవాడు. చొరవ అతని సొత్తు.

తన కర్తవ్యం గురించి ఆలోచించాడు. వాడ పెద్ద ఫకీరయ్య దగ్గరి కెళ్ళి అన్ని విషయాలు కూలంకషంగా చర్చించాడు

వాడలోను, ఊరిలోను ఉన్న పరస్పర భయాందోళనలు తొలగించాలి ముందు. తర్వాత ఉండేందుకు ఇల్లు బాగుచేసుకోవాలి. పోలీసులు రక్షణ ఉండి గస్తీ తిరుగుతూ ఉంటే ఒకరికొకరు సన్నిహితమయ్యే అవకాశమే ఉండదు. ఎన్నో ఊహించుకుని సాంబయ్య సెలవు మీద వచ్చాడు. ఇక్కడ ఎదురయిన వాతావరణం భిన్నంగా ఉంది. తన వాళ్ళకి తానేం చేయాలి. తన వాడను బాగు చేయడం ఎలా ? ఎక్కడో దూరంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనికుడుగా ఉంటూ సెలవుపై వచ్చిన తాను ఇక్కడ తన ప్రజలకి ఎలా తోడ్పడగలడు ? ఎంతో

వాళ్ళకి సేవ చేయాలి వాళ్ళ జీవితాల్ని కొంతవరకయినా చక్క దిద్దాలి. ఎంతవరకు సాధించగలడు? సైన్యం నుంచి వచ్చేసి వీళ్ళమధ్యే ఉంటూ సేవ చేయగలిగితే అంతకంటే ఆనందం ఉండదనుకున్నాడు. రకరకాల ఆలోచనలు ముసురుకుంటున్నాయి. తానుండేది రెండువారాల లోపే. ఫకీరయ్యతో సంప్రదించి కార్యరంగంలోకి దూకాడు. రత్నాన్ని తనవెంట ఉంచుకున్నాడు.

ప్రప్రథమంగా ఊరి పెద్దల దగ్గరికెళ్ళి చర్చించాడు. సమ్మతి వ్రాత పూర్వకంగా తీసుకుని పట్నం వెళ్ళాడు. కలెక్టర్ని, పోలీసు ఉన్నతాధికారుల్ని కలుసుకున్నాడు. వెంటనే పోలీసుల్ని ఉపసంహరించేందుకు అంగీకరించారు. పక్కా ఇళ్ల నిర్మాణ పథకం కార్యరూపం ధరించేలోగా పాకలు వేసుకునేందుకు కావలసిన సాధన సామగ్రి హుటాహుటిని తరలించే ఏర్పాటు జరిగింది.

హరిజన వాడంతా పాకల నిర్మాణంలో ఊపిరి సలపకుండా పనులు సాగిస్తోంది పోలీసులు వెళ్ళిపోయారు.

రోజులు గబగబా దొర్లిపోవడం ఈ పనుల సందడిలో ఎవరూ గుర్తించలేదు.

సాంబయ్య ఉండేందుకు ఇంకా వీలున్నది మూడు రోజులు మాత్రమే పెళ్ళి చేసుకుని తమతోపాటే కలో గంజో తాగుతూ ఉండమని తల్లితండ్రులు ప్రాధేయపడ్డారు. వాడలో చిన్నా పెద్దా తమ గోడు చెప్పుకుని తమ బ్రతుకులు బాగుపడాలంటే సాంబయ్య ఇక్కడే ఉండిపోవాలని మరిమరీ బ్రతిమిలాడారు.

వాడ పెద్ద ఫకీరయ్య "నువ్వే చూస్తున్నావుగా సాంబన్నా! మేం మూగ జీవాలం. మమ్మల్ని సుఖపెట్టాలంటే నువ్విక్కడే ఉండిపోవాలయ్యా" అన్నాడు.

సాంబయ్య తీవ్రంగా ఆలోచింపసాగాడు. మర్నాడు ఏదో ఒకటి కచ్చితంగా చెప్పాలి! వాడ ప్రజలకి అలవాటు ప్రకారం రాత్రి ట్రాన్సిస్టరుల్లో వార్తలు వింటుంటే సమ్‌ద్రనేచూ లోయలో చైనా హెలిప్యాడ్ నిర్మాణం గురించి, తవాంగ్ సెక్టర్లో సైనిక చలనం గురించీ తెలిసింది సాంబయ్య పని చేస్తోంది అక్కడే. అది అరుణాచల్ ప్రదేశ్‌లో ఉంది.

ఆ వార్త సాంబయ్యకి దేశమాత పిలుపుగా వినిపించింది. కర్తవ్య నిర్ణయం చేసుకున్నాడు. క్రమశిక్షణ గల సైనికుడిగా సరిహద్దు రక్షణ తన విద్యుక్తధర్మం. ఉదయమే ఈసంగతి తల్లిదండ్రులకి, ఫకీరయ్యకూ చెప్పాడు, రత్నాన్ని కలిసి "ఒక సమయంలో నాకు ఇక్కడే ఉండి పోదామనిపించింది. కాని దేశం నన్ను పిలిచింది. నువ్వు ఈ హరిజన వాడను బాగు చేయాలి గత రెండు వారాలుగా నాతో ఉన్నావ్. అలాగే పనులు చేసుకు పోతూవుంటే నా మనస్సు కుదుట పడుతుంది. ఏమంటావ్ రత్నం?" అని అడిగాడు ఆవేదనతో.

"తప్పకుండా శక్తి కొద్దీ పాటుపడుతా" మాటిచ్చాడు.

సాంబయ్య వెళ్ళేటప్పుడు అందరూ సంతోషంగా తిలకం దిద్ది సాగనంపాలి. ఇది ఫకీరయ్య ఆదేశం. ఎవరూ కంట తడి పెట్టకూడదు. అది అతని ఆంక్ష.

ప్రయాణం రోజున సాంబయ్య సైనిక దుస్తుల్లో ఎంతో గంభీరంగా కనిపించాడు. వీర తిలకం దిద్ది దీవించి రోడ్డు వరకు అందరూ వెంట వచ్చారు.

వేగం పుంజుకున్న బస్సు చేసే ధ్వని సాంబయ్యకి మంచు కొండలపైన రయ్ మంటూ వచ్చే గాలిలా వినిపించింది.